సాక్షి మహబూబ్‌నగర్

శనివారం, 1, జూన్, 2024



ఐటీడీఏ ఏర్పాటుకు కృషి

ఐటీడీఏను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామని రాష్ట్ర కార్యదర్శి శరత్ అన్నారు.

వివరాలు 10లో ▸



చిన్న కిస్తీ పోటీలు

షా అలీ పహిల్వాన్ ఉర్సులో భాగంగా చిన్న కిస్తీ పోటీలు నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
42.9 /27.6

వాతావరణం

ఉదయం నుంచే ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు టీటీడీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ పట్టణం విజయనగర్‌కాలనీలోని శ్రీపబ్బతి ఆంజనేయస్వామి దేవాలయం, వనపర్తి జిల్లాకేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, గద్వాల జిల్లా రామాపురంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయం, నాగర్‌కర్నూల్ జిల్లా గుండ్లగుంటపల్లిలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయంల్లో హనుమత్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆలయాల్లో ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, తమలపాకు పూజ, విశేష అర్చనలు, హనుమాన్‌చాలీసా పారాయణంతోపాటు ప్రవచనం జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు శ్రీనివాసుడి కల్యాణం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఏనుగొండలోని దేవునిగుట్టలోగల శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఉత్తరాది మఠంలో శనివారం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మఠాధికారులు పండిత ఆనందాచార్య జోషి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి పుణ్యాహవాచనం, కలశ స్థాపనం, సాయంత్రం 4 గంటల నుంచి వివిధ భజన మండళ్లచే భజన కార్యక్రమాలు, గురువందనం, 6.30 గంటల నుంచి భూసమేత శ్రీనివాస కల్యాణం జరుగుతాయని పేర్కొన్నారు.

ఇన్‌చార్జి డీపీఓగా రవీంద్రనాథ్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం పదవీ విరమణ చేశారు. దీంతో ఆయన స్థానంలో జిల్లా మైనార్టీ అధికారిగా ఉన్న రవీంద్రనాథ్‌కు ఇన్‌చార్జి డీపీఓగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ రవినాయక్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తిస్థాయి అధికారి వచ్చే వరకు రవీంద్రనాథ్ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

3 నుంచి ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షలు 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈఓ రవీందర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని ఇందులో 2,770 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్‌లు పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు టైంటేబుల్ ప్రకారం పరీక్షలకు హాజరుకావాలని సూచించారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాల్లో మొదటి సంవత్సరం 3,335 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 3,117 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం 1,265 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 1,148 మంది హాజరైనట్లు తెలిపారు. ఈమేరకు డీఈసీ సభ్యులు బాలానగర్ లోని పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ముంపు నుంచి బయట పడినట్టేనా?!



గాండ్లోనిచెరువు వద్ద ఇదీ పరిస్థితి.. (ఇన్‌సెట్‌లో) ఇళ్ల మధ్యలో నుంచి వెళ్తున్న చెరువు పాటుకాల్వ

అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం

పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు రాకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మొత్తం 13 పాటు కాల్వలలో పూడికతీత, చెత్తాచెదారం తొలగింపజేస్తున్నాం. ఎక్కడా వరదనీరు, మురుగు నిల్వ ఉండకుండా, సమీప కాలనీలలోని ఇళ్ల వరకు చేరకుండా పనులు కొనసాగుతున్నాయి. ఈసారి వర్షాకాలంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

- ఏటా లోతట్టు ప్రాంతాలకు వరద నీరు
- ఈసారి ముందస్తు చర్యలు చేపట్టామన్న అధికారులు
- జిల్లాకేంద్రంలోని పాటు కాల్వలు, నాలాల్లో పూడికతీత
- వర్షం వస్తే సాఫీగా ముందుకెళ్లేలా ఏర్పాట్లు
- ఇక ఇళ్లలోకి వరద రాదంటున్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వర్షాకాలం వస్తుందంటే చాలు జిల్లా కేంద్రం లోని లోతట్టు ప్రాంతవాసులు తల్లడిల్లిపోతారు. ముఖ్యంగా పెద్ద చెరువు, ఎర్రకుంట, గాండ్లోనిచెరువు సమీపంలోని కాలనీలు ఏటా ముంపు బారిన పడుతున్నాయి. భారీ వర్షం కురిస్తే కొన్ని ఇళ్లలోకి వరద నీటితో పాటు మురుగు కలిసి వస్తుండటంతో తోడివేసేందుకు కొన్ని రోజులు పడుతుంది. దీంతో తాము పడరాని పాట్లు పడుతున్నా మున్సిపల్ అధికారులు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇక మరో 15 రోజుల్లో వర్షాకాలం ఆరంభం కానుంది. అయితే అధికారులు మాత్రం ఈసారి ముందస్తుగానే నివారణ చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు.

13 వరద కాల్వల గుర్తింపు

పట్టణ పరిధిలో మొత్తం 13 వరద పాటుకాల్వలు 22.5 కి.మీ. మేర ఉన్నట్లు మున్సిపల్ అధికారులు గుర్తించారు. వీటిలో బోయపల్లి రోడ్ నుంచి మోతీనగర్, పాత కలెక్టరేట్, కొత్తబస్టాండు, జగ్జీవన్‌రాంనగర్‌కాలనీ మీదుగా పెద్దచెరువు వరకు 2.5 కి.మీ. మేర (వార్డు నం.48, 49, 42) పాటు కాల్వ ఉంది. గాండ్లోనిచెరువు సమీపం నుంచి సద్దలగుండు, బాయమ్మతోట, రాజేంద్రనగర్, న్యూటౌన్ మీదుగా పెద్దచెరువు వరకు 3 కి.మీ. (వార్డు నం.37, 38, 18, 39, 40) పాటు కాల్వ ఉంది. ఎర్రకుంట సమీపం నుంచి పాతపాలమూరు, ఇమామ్‌సాబ్‌కుంట వరకు 2 కి.మీ. (వార్డు నం.27, 26, 25) పాటు కాల్వ ఉంది. రావుఫ్‌సాబ్ దర్గా సమీపం నుంచి వీరన్నపేట మీదుగా ఎర్రకుంట వరకు 2 కి.మీ. (వార్డు నం.14, 30, 31) వరద కాల్వ ఉంది. ఇండస్ట్రియల్ ఏరియా నుంచి టీచర్స్ కాలనీ మీదుగా షాషాబ్‌గుట్ట, మర్లు వరకు 3 కి.మీ. (వార్డు నం.18, 19, 9, 41, 22) పాటుకాల్వ ఉంది. కుమ్మరివాడి వంతెన నుంచి బండ్లగేరి, కురివిశెట్టికాలనీ మీదుగా ఎర్రకుంట వరకు 0.5 కి.మీ. (వార్డు నం.28) వరద కాల్వ ఉంది. అయోధ్యనగర్ నుంచి బంజారా కాలనీ మీదుగా ఆదర్శనగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపం వరకు 3.5 కి.మీ. (వార్డు నం.10) పాటు కాల్వ ఉంది. కుమ్మరివాడిలోని హనుమాన్ దేవాలయం వద్ద నుంచి ఎర్రకుంట వరకు 0.5 (వార్డు నం.28) పాటుకాల్వ ఉంది. విజయవందన అపార్ట్‌మెంట్ పక్క నుంచి లక్ష్మీనగర్‌కాలనీ మీదుగా చిక్కుడువాగు వరకు (వార్డు నం.1, 2) కి.మీ. వరద కాల్వ ఉంది. ఎస్‌వీఎస్ ఆస్పత్రి పక్క నుంచి ఎనుగొండ, సంతోష్‌నగర్‌కాలనీ మీదుగా పాల్కొండ చెరువు వరకు (వార్డు నం.4, 5, 6) 2 కి.మీ. పాటు కాల్వ ఉంది. చిన్నదర్‌పల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్ వెనుక భాగంలో (వార్డు నం.15) కి.మీ. వరద కాల్వ ఉంది. కొత్తచెరువు సమీపం నుంచి టీడీగుట్ట వరకు (వార్డు నం.34), కి.మీ. కాల్వ ఉంది. ఇదే వార్డులోని ప్రభుత్వ కమ్యూనిటీ హాలు సమీపం నుంచి ఈద్గా మీదుగా గొల్లోల్ల ఇళ్ల వరకు 0.5 కి.మీ. వరద కాల్వ ఉంది. వీటన్నింటిలో కొన్ని రోజులుగా పారిశుద్ధ్య కార్మికులతో పాటు అవసరమైన చోట జేసీబీ ద్వారా పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. కాగా, ఈ పనులను ఇటీవల మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వచ్చే సీజన్‌లో భారీ వర్షాలు కురిసినప్పుడు వీటి గుండా వరదనీరు సాఫీగా ముందుకు వెళ్తుందని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

లోతట్టు ప్రాంతాలివే..

పట్టణంలోని రామయ్యబౌలి, శివశక్తినగర్, మేకలబండ, బీకేరెడ్డికాలనీ, బీఎన్‌రెడ్డి కాలనీ, మధురానగర్, శేషాద్రినగర్, అయోధ్యనగర్, గణేష్‌నగర్, గాడ్స్ కాలనీ, వల్లభ్‌నగర్, ప్రేమ్‌నగర్, సద్దలగుండు, కమలానెహ్రూకాలనీ, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు భారీ వర్షాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కాగా పెద్ద చెరువు అలుగు నుంచి రామయ్యబౌలి వైపు నీరు వెళ్లేలా గత ఏడాది పెద్ద నాలా, కల్వర్టు నిర్మించారు. ఇక బీకేరెడ్డి కాలనీ, శివశక్తి నగర్ వైపు పెద్ద నాలా, బాక్స్ కల్వర్ట్ ఇంకా అసంపూర్తిగానే ఉంది. వీటిని త్వరలోనే పూర్తి చేయిస్తామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.



పాతతోట ప్రాంతంలోని వరద కాల్వలో కొనసాగుతున్న పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు (ఫైల్)

ప్రయాణికులకు బంపర్ ఆఫర్

- సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో లక్కీ డిప్ స్కీం
- మహబూబ్‌నగర్–హైదరాబాద్ రూట్లోనే..





సూపర్‌లగ్జరీ బస్సులో డ్రైవర్ వెనుక ఏర్పాటు చేసిన గిఫ్ట్‌బాక్స్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఇటీవల కాలంలో ఆర్టీసీ సంస్థకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆక్యుపెన్సి రేషియో క్రమేపీ పెరుగుతుంది. ముఖ్యంగా మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో ఆదాయపరంగా రీజియన్‌లో మెరుగైన స్థానంలో ఉంది. ఈ డిపో పరిధిలో హైదరాబాద్ రూట్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. పండుగలతో పాటు వారాంత సెలవుల్లో ఈ రూట్లో ప్రయాణికులు ఎక్కువగా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ప్రతి రోజు అప్ అండ్ డౌన్ 70 ట్రిప్పులు నడుపుతున్నారు. సూపర్ లగ్జరీ 58, డీలక్స్ బస్సులు 12 ట్రిప్పులు నడుస్తున్నాయి. ఈ రూట్లో నిత్యం 2,500 నుంచి 2,600 మంది ప్రయాణిస్తున్నారు. ఈ రూట్లో డిపోకు ప్రతి రోజు సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల ద్వారానే దాదాపు రూ.4లక్షల నుంచి రూ.4.50లక్షల ఆదాయం వస్తుంది.

నేటి నుంచి అమల్లోకి లక్కీడిప్

మహబూబ్‌నగర్–హైదరాబాద్ అప్ అండ్ డౌన్ రూట్లో సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో ప్రయాణికులకు శనివారం నుంచి లక్కీడిప్ అమల్లోకి రానుంది. డ్రైవర్ వెనుకవైపు ఉన్న గిఫ్ట్‌బాక్సుల్లో తాము ప్రయాణించిన టికెట్‌పై పేరు, ఫోన్ నంబర్ రాసి వేయాలి. ప్రతి నెల మొదటివారంలో డిప్ నిర్వహించి మూడు బహుమతులు ఇవ్వనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మహబూబ్‌నగర్–హైదరాబాద్ రూట్లో సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించేవారి కోసం ప్రత్యేక లక్కీడిప్ తీసుకొచ్చాం. శనివారం నుంచి అమల్లోకి వస్తుంది. ఈ రూట్లో ప్రయాణించేవారు సద్వినియోగం చేసుకోవాలి.

– సుజాత, ఆర్టీసీ డిపో మేనేజర్, మహబూబ్‌నగర్

ఏసీబీ వలలో అవినీతి చేపలు

- ఏకకాలంలో రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన ముగ్గురు టీజీఎస్పీడీసీఎల్ అధికారులు
- రూ.19వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్ఈ, డీఈఈ, ఏఈ



ఏసీబీ అధికారులకు పట్టుబడిన వనపర్తి జిల్లా ఎస్ఈ, డీఈఈ, ఏఈ(టెక్నికల్)

వనపర్తి: విద్యుత్ శాఖలోని ముగ్గురు అవినీతి అధికారులు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వారికి రూ. లక్షల్లో వేతనాలు ఉన్నా.. అక్రమ సంపాదనపై ఉన్న పేరాశతో లంచావతరం ఎత్తారు. మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెంలో ఏర్పాటుచేసుకున్న సీఎంఆర్ రెస్టారెంట్‌కు విద్యుత్ సౌకర్యం కోసం త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్, లైన్ ఏర్పాటుచేయాలని నిర్వాహకులు కోరగా.. కొత్తకోట ఆపరేషన్ విభాగం అధికారులు మంజూరు కోసం వనపర్తి డీఈఈ, ఎస్ఈ కార్యాలయానికి రెఫర్ చేశారు. టీజీఎస్‌పీడీసీఎల్‌లో కాంట్రాక్ట్ పనులు చేసే కొత్తకోట మండలం నిర్వేన్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్‌కు వర్క్ మంజూరు కోసం రూ. 21 వేలు లంచం ఇవ్వాలని ఎస్ఈ నాగేంద్ర కుమార్, డీఈఈ నరేంద్ర కుమార్, ఎస్ఈ కార్యాలయంలోని ఏఈ (టెక్నికల్) మధుకర్ డిమాండ్ చేశారు. నెలరోజులుగా బేరమాడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో అతడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా.. డీఎస్పీ కృష్ణగౌడ్ 13 మంది సిబ్బందితో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిఘా పెట్టారు. సాయంత్రం 6:50 గంటలకు ఫిర్యాదుదారు నుంచి సంబంధిత అధికారులు లంచం తీసుకుంటుండగా.. దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ విషయంపై వారిని విచారించగా.. ఎస్ఈ నాగేంద్ర కుమార్‌కు రూ.8 వేలు, డీఈఈ నరేంద్ర కుమార్‌కు రూ.10 వేలు, ఏఈ మధుకర్ (టెక్నికల్)కు రూ.1,000 చొప్పున తీసుకున్నట్లు పంచనామాలో పేర్కొన్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, శనివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఫ్లాష్.. ఫ్లాష్..



హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు దుర్మరణం, ముగ్గురికి తీవ్ర గాయాలు
- జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో ఘటన

– వివరాలు 10లో..

బీటీ–3 విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

- జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు



భూత్పూర్‌లో ఓ సీడ్స్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేశ్వర్లు

భూత్పూర్: విత్తనాలు విక్రయించే సీడ్స్ దుకాణా యజమానులు బీటీ–3 పత్తి విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలల్లోని 21 సీడ్స్ విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్ రిజిస్టర్లు, పత్తి విత్తనాల పాకెట్ల విక్రయాలు, నిల్వ విత్తన పాకెట్లు, వ్యవసాయాధికారి సర్టిఫైయిడ్ చేసిన రశీదు బుక్‌లను తనిఖీ చేశారు. ప్రతి రోజు క్రయవిక్రయాలతో పాటు విత్తనాల స్టాక్‌కు సంబంధించిన రిజిస్టర్లు రోజువారీగా రికార్డులో నమోదు చేయాలని దుకాణాదారులను ఆదేశించారు. జడ్చర్ల వ్యవసాయాధికారి గోపినాథ్, మిడ్జిల్ వ్యవసాయాధికారి సిద్ధార్థలతో రెండు బృందాలు సీడ్స్ దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావు, ఏఓ మురళీధర్, ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

'13న కలెక్టరేట్ ముట్టడి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం తెలంగాణ హెల్త్ కమ్యూనిటీ వర్కర్స్ ఆశా యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఆర్‌ఓ రవికుమార్‌కు, డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మాస్‌మీడియా అధికారి తిరుపతిరావుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు నష్టదాయకమైన పరీక్షను వెంటనే రద్దు చేయాలన్నారు. అన్ని రకాల వేధింపులు ఆపాలని, సంబంధం లేని పనులు అప్పజెప్పవద్దన్నారు. ఈ డిమాండ్లు పరిష్కరించని పక్షంలో జూన్ 13న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు.

కుట్టు పని వేగంగా చేపట్టాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం కొత్త యూనిఫాం కుట్టే పని వేగంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మెప్మా సీలు, ఆర్‌పీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 12,329 మంది విద్యా ర్థులకు ఈ యూనిఫాం ఇవ్వాల్సి ఉందన్నారు. సమయం తక్కువగా ఉన్నందున క్లాత్ కటింగ్ అయిన వెంటనే స్టిచింగ్‌కు ఇవ్వాలన్నారు. ఒక్కో జతకు కుట్టు కూలి రూ.50 నుంచి రూ.70కి రాష్ట్ర ప్రభుత్వం పెంచిందన్నారు. ఏ రోజు కారోజు పని పూర్తి కాగానే ఎంఈఓ జయశ్రీకి అప్పగించాలన్నారు. డీఎంసీ శివకుమార్‌గౌడ్, టీఎంసీ కరుణాకర్‌గౌడ్, సీఓలు యాదయ్య, ఆంజనేయులు, నిర్మల, వరలక్ష్మి, దేవమ్మ పాల్గొన్నారు.

■ ఆర్‌అండ్‌బీ జంక్షన్‌లోని అమరవీరుల స్థూపం వద్ద పిచ్చిమొక్కల తొలగింపు, తిమ్మసానిపల్లి, శ్రీనివాసకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి, న్యూటౌన్ నుంచి పెద్దచెరువు పక్కన ఉన్న మురుగుకాల్వలో పూడికతీత పనులను కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు.


నిర్లక్ష్యమేలా..?

కేఎల్ఐ ప్రాజెక్టు మోటార్ల మరమ్మతుపై నీలినీడలు

- మూలకు పడిన మూడు మోటారు పంపులు
- నాలుగేళ్లుగా వీటి ఊసే మరచిన అధికారులు
- ప్రస్తుతానికి రెండింటితోనే నీటి ఎత్తిపోతలు
- కృష్ణానదికి వరదలు వచ్చిన సమయంలో ఇబ్బందులు



ఎల్లూరు పంపుహౌజ్ వద్ద పాడైన మోటార్ భాగాలు



ఎల్లూరులోని పంపుహౌజ్

కొల్లాపూర్: ఉమ్మడి జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కేఎల్ఐ నిర్వహణపై నీలినీడలు అలుముకున్నాయి. ప్రాజెక్టులోని మొదటి పంపు హౌజ్‌లో రెండు మోటార్లు పాడై ఏళ్లు గడుస్తున్నా.. కనీసం వాటికి మరమ్మతు చేయడంలోనూ ఇటు అధికారులు, అటు కాంట్రాక్టు కంపెనీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు నీటి ఎత్తిపోతలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ప్రతి ఏడాది వేసవిలో మోటార్లకు మరమ్మతు చేస్తామని అధికారులు చెబుతున్నా.. ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు.

ఎల్లూరు పంప్‌హౌజ్‌లో..

కేఎల్ఐ ప్రాజెక్టులోని ఎల్లూరు పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోసి.. ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లి గట్టు రిజర్వాయర్లను నింపాలి. వీటికి అనుసంధానంగా ఉన్న చెరువులకు సైతం వరదల సమయంలోనే తరలించాలి. ఇందుకోసం ఎల్లూరు పంప్‌హౌజ్‌లో 5 మోటార్లను ఏర్పాటు చేశారు. వీటిలో రెండు మోటార్లు పాడయ్యాయి. ఐదేళ్ల క్రితం పంప్‌హౌజ్‌లోకి నీరు చేరుకోవడంతో మూడో పంప్ మోటారు దెబ్బతింది. కనీసం ఈ మోటారును కూడా పట్టించుకునే పాపాన పోలేదు. దీంతో మిగిలిన రెండు మోటార్లతోనే నీటి ఎత్తిపోతలు చేపడుతున్నారు.

ఎత్తిపోతలకు ఇక్కట్లు..

ఎల్లూరు పంప్‌హౌజ్‌లో రెండు మోటార్లతోనే నీటిని ఎత్తి పోస్తుండడంతో జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు నింపడంలో ఆలస్యమవుతోంది. కృష్ణానది వరద ప్రవాహ సమయంలో ఎల్లూరు పంప్‌హౌజ్‌లో నాలుగు మోటార్లు నడిపించి రోజుకు 3,200 క్యూసెక్కుల చొప్పున నీటిని ఎత్తిపోయాలి. ఈ నీటితో రిజర్వాయర్లతోపాటు చెరువులు కూడా నింపుకోవాలి. కానీ, ఎల్లూరు లిఫ్టులో రెండు మోటార్లు మాత్రమే పని చేస్తుండటంతో ఆశించిన స్థాయిలో ఎత్తిపోతలు జరగడం లేదు. దీంతో జిల్లావ్యాప్తంగా ఉన్న 2,208 చెరువులను నింపేందుకు ప్రతి సంవత్సరం నెలల సమయం పడుతోంది.

మరమ్మతుకు ఆటంకాలు

కేఎల్ఐ ప్రాజెక్టులో మోటార్లు పాడైతే మరమ్మతు చేపట్టడం ఇబ్బందికరంగా మారుతోంది. ఉమ్మడి పాలమూరుతోపాటు రంగారెడ్డి జిల్లాలకు తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ స్కీం కేఎల్ఐకి అనుసంధానంగా ఉండటంతో రెగ్యులర్‌గా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. దీంతో మోటార్ల మరమ్మతుకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మోటార్లు మరమ్మతు చేయాలంటే నీటి ఎత్తిపోతలు కొద్దికాలం ఆపాల్సి ఉంటుంది. పాలమూరు ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి వస్తేనే కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతలు నిలిపి వేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే పాలమూరు ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా ప్రారంభమయ్యే వరకు మోటార్లకు మరమ్మతు చేపట్టడం కష్టమేనని అధికారులు చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి..



27 మండలాల్లోని 4 లక్షల ఎకరాలకు కేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా సాగునీరు, 14 నియోజకవర్గాల ప్రజలకు తాగునీరు అందుతోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టాలి. పంపు మోటార్ల మరమ్మతు గురించి అధికారులు స్పందించాలి. అప్రోచ్ చానల్ చివరలో షట్టర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. దీనిపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

– ఎస్ఎండీ ఫయాజ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు

ప్రభుత్వం దృష్టిసారించాలి



కేఎల్ఐ ప్రాజెక్టులో మరమ్మతుకు గురైన మోటార్లపై ప్రభుత్వం దృష్టిసారించాలి. చాలాకాలంగా ప్రాజెక్టు నిర్వహణ గురించే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి సాగు, తాగునీటి సరఫరాకు ఆటంకాలు లేకుండా వీలైనంత త్వరగా మరమ్మతు చేపట్టాలి.

– వెంకటనర్సింహారెడ్డి, రైతు, కొల్లాపూర్

ఎత్తిపోతలు ఆపితేనే..

ఎల్లూరు లిఫ్టులో మూడు మోటార్లు మరమ్మతుకు గురయ్యాయి. దీంతో రెండు మోటార్లతోనే నీటి ఎత్తిపోతలు చేపడుతున్నాం. మిషన్ భగీరథ కోసం రెగ్యులర్‌గా నీటి ఎత్తిపోత ఉంటుంది. లిఫ్టు ద్వారా ఎత్తిపోతలు ఆపితేనే మోటార్లు మరమ్మతు చేయడం సాధ్యమవుతుంది. మరమ్మతు అంశం ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది.

– లోకిలాల్ నాయక్, డీఈ

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని చిన్నారి మృతి


అక్షిత (ఫైల్)

నర్వ: ట్రాక్టర్ ఢీకొని చిన్నారి మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్లంపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చెన్నారెడ్డి ట్రాక్టర్‌ను ఆయన మనుమడు మణవర్ధన్ ఇంటి వద్ద నుంచి డ్రైవింగ్ చేసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన గెంటీల నాగరాజు, గెంటీల మొగులమ్మ కూతురు అక్షిత(3) ఇంటి వద్ద నుంచి అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఆ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. శనివారం ఆ చిన్నారి జన్మదినం ఉండడంతో ఒక్క రోజు ముందుగానే ఆ చిన్నారికి కొత్త దుస్తులు ఆన్‌లైన్‌లో తల్లిదండ్రులు బుక్‌చేశారన్నారు. ఇందుకు సంబంధించిన పార్సిల్‌ను కొరియర్ బాయ్ శుక్రవారం అందియడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ ఘటనపై పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వారు తెలిపారు.

లారీ, డీసీఎం ఢీ: క్లీనర్ దుర్మరణం




పాత్లావత్ సూర్య నాయక్ (ఫైల్)

కొత్తకోట రూరల్: డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా లారీని ఓవర్‌టేక్ చేయబోయి బలంగా ఢీకొనడంతో డీసీఎం క్లీనర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కొత్తకోట మండలం పాలెం జాతీయరహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం వెంకన్నగూడ చెందిన పాత్లావత్ సూర్యనాయక్(21) నాలుగు నెలల నుంచి డీసీఎం క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కర్నూల్ నుంచి కోళ్ల ఎరువును డీసీఎంలో లోడ్ చేసుకుని హైదరాబాద్‌కు బయలు దేరారు. డీసీఎంను డ్రైవర్ పక్కన క్లీనర్ సూర్యనాయక్ కూర్చున్నాడు. డీసీఎం శుక్రవారం తెల్లవారుజామున పాలెం సమీపంలోకి రాగానే స్టీల్ లోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని డీసీఎం ఓవర్‌టేక్ చేయబోయి వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో క్లీనర్ పాత్లావత్ సూర్యనాయక్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సూర్యనాయక్ మృతదేహాన్ని వనపర్తి ఆస్పత్రికి తరలించారు. హైవే సిబ్బంది, పోలీసులు ఎంతో శ్రమించి రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీ, డీసీఎంను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతుడి తండ్రి కిషన్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎద్దు కొవ్వుతో నూనె తయారీ: కేసు నమోదు



అయిజ: పట్టణంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఎద్దు కొవ్వుతో నూనె తయారు చేసి విక్రయిస్తుండడంతో పోలీసులు శుక్రవారం దాడిచేశారు. ఎస్ఐ విజయ భాస్కర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సీ కాలనీకి చెందిన అగ్గి రాముడు, ఆయన కూతురు శ్రావణి కొంతకాలంగా మృతి చెందిన ఎద్దుల కొవ్వుతో నూనె తయారుచేసి సుదూర ప్రాంతాలకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రతి ఆదివారం సుమారు ఆరు నుంచి ఏడు ఎద్దులను కోసి వాటి మాంసంను విక్రయించగా మిగిలిన కొవ్వు, ఎముకలను కరుగబెట్టి నూనెను తయారు చేసి తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న కాలనీవాసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నూనె తయారు చేసే షెడ్డుపై దాడి నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

8 మత్స్య సహకార సంఘాలకు ఎన్నికలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో 8మత్స్య సహకార సంఘాలతోపాటు కో–ఆపరేటివ్ అర్బన్‌కు, గొర్రెల పెంపకందారుల సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు డీసీఓ ఎ.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంఘాలకు జూన్ 6 నుంచి 28వ తేదీలోగా ఎన్నికలు పూర్తి చేయడానికి త్వరలో షెడ్యూల్ విడుదలవుతుందని పేర్కొన్నారు. ఇక వివిధ సహకార సంఘాలకు సంబంధించి విధి నిర్వహణలో ఉన్న పాలక వర్గాలు/ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలు/ అధికారిక పరిపాలకుడు/ అడ్‌హక్ కమిటీ సంఘానికి ఎన్నికలు జరిపించాలని కమిటీ పదవీకాలం ముగియడానికి కనీసం 60 రోజుల ముందు రాష్ట్ర సహకారం ఎన్నికల అథారిటీకి ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుందని సూచించారు.

ఐటీడీఏ అధికారిక ఏర్పాటుకు కృషి


చెంచు లక్ష్మి రెస్టారెంట్ పరిసరాలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శరత్

- ఐటీడీఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శరత్

మన్ననూర్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మన్ననూర్‌లో చెంచుల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ను పూర్తి స్థాయిలో అధికారులు, సిబ్బందిని నియమించే విధంగా కృషి చేస్తానని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శరత్ అన్నారు. అంతకు ముందు గ్రామంలోని చెంచు లక్ష్మి రెస్టారెంట్, మ్యూజియం, చెంచు మహిళా సమాఖ్య, ఆర్య సమాజ్ ప్రాంగణాలను ఆయన పరిశీలించిన అనంతరం ఐటీడీఏ కార్యాలయం ప్రాంగణంలో కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఐటీడీఏ పీఓ, డీఎఫ్ఓ రోహిత్ రెడ్డితో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెంచుల అభ్యున్నతికి ప్రవేశపెట్టే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ఐటీడీఏ ఏర్పాటుతో పూర్తిగా సఫలీకృతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 10 ఏళ్లుగా ఇన్‌చార్జి పీఓ, ఒకే అధికారిగా కొనసాగుతున్న కార్యాలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గ్రూప్–1 అధికారితో పాటు అన్ని వింగులలో అధికారులు, సిబ్బందిని నియమించి భద్రాచలం ఐటీడీఏ మాదిరిగా మరో రెండు నెలల్లో ఈ ప్రాంత చెంచులకు అన్ని విధాలుగా ఉపయోగపడేవిధంగా ఏర్పాట్లు చేస్తామని ఆయన తెలిపారు.

చెంచు లక్ష్మి మ్యూజియంకు పూర్వ వైభవం

శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లో కొంతకాలంగా శిథిలావస్థకు చేరుకున్న చెంచు లక్ష్మి మ్యూజియానికి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. పర్యాటకుల రద్దీ ఉండేలా పునః నిర్మాణం చేస్తామన్నారు. ఈ క్రమంలో మ్యూజియం వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో 20 విశ్రాంతి గదులు నిర్మించేందుకు వారం రోజుల్లో ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధిపరంగా చెంచులకు సహకరించని ఐటీడీఏ అధికారిని తొలగించాలని చెంచు సేవా సంఘం నాయకులు రాజేంద్ర ప్రసాద్, శంకరయ్య, పెద్దిరాజు, అంజయ్య రాష్ట్ర కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గతంలో మంజూరైన నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, జీసీసీ మేనేజర్ సంతోష్‌కుమార్, డీసీ వెంకటేశ్వర్ సింగ్, జాఫర్, లక్ష్మయ్య, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార పరంగా చెంచులకు ప్రోత్సాహం

ఆధునిక ప్రపంచంలో చెంచులను వ్యాపారపరంగా ప్రోత్సహించేందుకు మన్ననూర్ పరిసర ప్రాంతాల్లో వారి కోసం 40 నుంచి 50 వరకు వ్యాపార దుకాణాలను (షాపింగ్ కాంప్లెక్స్) నిర్మించనున్నట్లు తెలిపారు. మన్ననూర్–శ్రీశైలం ప్రధాన రహదారి వెంట రోడ్డుకు ఇరువైపుల వ్యాపారాలు చేసుకునేందుకు దుకాణాలు నిర్మించి వారికి అవసరమైన శిక్షణ, అవగాహన కల్పిస్తామన్నారు. శానిటరీ, న్యాప్‌కిన్ వంటివి తయారు చేయడంతో పాటు అమ్మకాలు చేసేలా తర్ఫీదు ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువతను ఎంపిక చేసి సుమారు వంద మంది వరకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గిరిజనులకు ఎంతగానో ఉపయోగపడే మాడా కార్యాలయాన్ని జిల్లా కేంద్రం నుంచి మన్ననూర్‌కు తీసుకువచ్చే ఏర్పాటు చేస్తానన్నారు. ఈ ప్రాంతంలో నిర్వహణలో ఉన్న 11 గిరిజన పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటుకు తక్షణమే ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్..

హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురు దుర్మరణం, ముగ్గురికి తీవ్ర గాయాలు

- లారీని వెనుక నుంచి ఢీ కొట్టిన స్కార్పియో వాహనం
- మృతుల్లో ఒక డ్రైవర్, ఇద్దరు మహిళలు, ఒక పిల్లాడు
- కర్నూలు ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో ఘటన


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం


ఘటన స్థలంలో మృతదేహాలు

అలంపూర్: 44వ నంబర్‌జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముందుగా వెళుతున్న లారీని స్కార్పియో వాహనం వెనుక నుంచి ఢీ కొట్టడంతో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి చౌరస్తా సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపువద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కర్నూలు జిల్లా వైపు నుంచి శుక్రవారం రాత్రి ఏడుగురు వ్యక్తులు హైదరాబాద్ వైపు స్కార్పియో వాహనంలో బయల్దేరారు. గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి చౌరస్తా సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్ద ముందుగా మొక్కజొన్నల లోడ్‌తో వెళుతున్న లారీని ఆ వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్(35), అందులో ఇద్దరు మహిళలు ఒకరు (40), మరొకరు (35)తో పాటు నాలుగేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు అలంపూర్ సీఐ రవిబాబు తెలిపారు. మృతులకు సంబంధించిన సెల్‌ఫోన్‌లోని కాంట్రాక్ట్ లిస్టులో ఉన్న వారికి ఫోన్ చేసినా.. లిఫ్ట్ చేయకపోవడంతో మృతుల వివరాలు తెలియరాలేదు. కారులో ఉన్న వారు ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణం చేస్తున్నారో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ఆధారంగా సైతం పోలీసులు తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

నాణ్యతగా చెరువుకట్ట పనులు


పనులను పరిశీలిస్తున్న ఐబీ అధికారులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువుకట్ట పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని ఐబీ సీఈ రఘునాథరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఈఈ సత్యశీలారెడ్డి, డీఈ నరేందర్‌రెడ్డితో కలిసి గణపసముద్రం చెరువు పనులు, చెరువుకు నీళ్లు మళ్లించే వద్ద మల్కిమియాన్‌పల్లి శివారులో కూలిపోయిన కత్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నందున గణపసముద్రం చెరువుకట్ట పనులు వేగవంతంగా పూర్తి చేయడం వలన చెరువును వర్షాకాలంలో నీటితో నింపడానికి వీలుంటుందన్నారు. అందుకు గాను కట్ట పనులు, పాటు కాల్వకు నీళ్లు రావడానికి పెద్ద వాగుకు కత్వ నిర్మించాల్సి ఉందన్నారు. తరుచుగా మండల, జిల్లా స్థాయి అధికారులు పనులను పరిశీలిస్తారన్నారు.

కాల్వ పనులు అడ్డగించిన రైతులు


రైతులతో మాట్లాడుతున్న డీఈ నరేందర్‌రెడ్డి

అడ్డాకుల: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఖిల్లాఘనపురం మండలం మీదుగా అడ్డాకుల మండలంలోని గ్రామాలకు సాగు నీరందించే కాల్వ పనులను శుక్రవారం సుంకరాంపల్లి వద్ద రైతులు అడ్డుకున్నారు. కాల్వ ఏర్పాటుతో తాము భూములు కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 22 మంది రైతులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందాల్సి ఉన్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కాగా అడ్డగింత సమాచారం అందుకున్న డీఈ నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి గ్రామానికి వెళ్లి రైతులతో మాట్లాడారు. నష్ట పరిహారం అందించే విషయాన్ని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రెండు నెలల్లో పరిహారం అందించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

18 క్వింటాళ్ల లూజ్ పత్తి విత్తనాల పట్టివేత


ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన విత్తనాలను పరిశీలిస్తున్న అధికారులు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీల్లో నంద్యాల్ నుంచి నిజామాబాద్ ఆర్మూర్‌కు తరలిస్తున్న లూజ్ పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి సమయంలో బొలేరో వాహనంలో అక్రమంగా 18 క్వింటాళ్ల లూజ్ పత్తి విత్తనాలను తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు వాహనాలను తనిఖీ చేయడంతో విత్తనాలు పట్టుబడ్డాయన్నారు. వీటి విలువ దాదాపు రూ. 9 లక్షలు ఉంటుందన్నారు. కాగా డ్రైవర్ కోటేశ్వర్ రావుపై కేసు నమోదు చేశామని, వాహనాన్ని సీజ్ చేసి ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు. సీఐ రవిబాబు, సీసీఎస్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ సురేఖ, ఏఎస్ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విత్తనాల గురించి ఆరా తీస్తున్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సంగెం సూర్యారావు

అడ్డాకుల: మహబూబ్‌నగర్‌లోని వైన్‌షాపు వద్ద శ్రీకాంత్ యాదవ్‌పై దాడి చేసిన వారిలో తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులను వెంటనే అరెస్టు చేయాలని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు డిమాండ్ చేశారు. అడ్డాకుల మండలం బలీదుపల్లిలోని శ్రీకాంత్ యాదవ్ తల్లిదండ్రులను శుక్రవారం ఆయన పరామర్శించారు. శ్రీకాంత్ యాదవ్‌పై దాడి ఘటనను ఖండిస్తూ తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు నిందితులకు రాజకీయ అండ ఉండటంతోనే పోలీసులు వారిని అరెస్టు చేయడం లేదని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు వెంటనే వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే దాడి ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం కోసం పోరాటం చేస్తామని తెలిపారు. నిందితులను పట్టు కునే వరకు బాధిత కుటుంబం తరుపున పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్, కోకన్వీనర్ సవారి సత్యం, వేణుయాదవ్, మాజీ ఎంపీపీ దయాకర్, శ్రీధర్, మహేష్, ఆంజనేయులు ఉన్నారు.

దేశ రక్షణ, ధార్మికతలో మహిళలు ముందుండాలి


శిక్షణలో యువతులు

భూత్పూర్: దేశ రక్షణ, ధార్మికతలో మహిళలు ముందుండాలని ప్రముఖ ధార్మిక ఉపన్యాసకురాలు భారతి సత్యవాణి తెలిపారు. పట్టణంలో తెలంగాణ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో దుర్గావాహిని విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రశిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. వారం రోజుల పాటు దండ ప్రయోగం, నీయుద్ధ, చూరిక, కోలాటాలు, ఘన సంపదలు, ఆత్మరక్షణ విద్యలను యువతులు ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ 1964లో వీహెచ్‌పీ స్థాపించి, అయోధ్య రామ మందిరం ఉద్యమంలో ఎంతో మంది మహిళకు ఉద్యమ స్ఫూర్తిగా నిలిచిన ఘనత దుర్గావాహినిది, కార్యకర్తలదని ఆమె కొనియాడారు. శిబిరంలో నేర్చుకొన్న వాటిని ఆత్మరక్షణ కోసం ప్రదర్శించాలని, దుర్గాశక్తిగా సమాజంలో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్ఞమాల భారతి, సక్కుబాయి, సునీతా రామ్మోహన్, నరసింహమూర్తి, సింధూజ, మాధవి పాల్గొన్నారు.

వాట్సాప్ లింక్ ఓపెన్ చేస్తే రూ.లక్షలు మాయం

రాజోళి: వాట్సాప్‌లో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయగా రూ.లక్షలు పొగొట్టుకున్న ఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎల్లప్ప వాట్సాప్ ద్వారా వచ్చిన లింక్‌ను ఓపెన్ చేశాడు. అందులో సూచించిన విధంగా నమోదు చేస్తూ వెళ్లగా, తనకు చెందిన మూడు క్రెడిట్ కార్డుల నుంచి రూ.2.50లక్షలు మాయమైనట్లు గ్రహించాడు. సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వాపోయాడు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

కొల్లాపూర్: పట్టణంలోని 11వ వార్డులో గల యూపీఎస్ స్కూల్ సమీపంలో పిచ్చికుక్క దాడిలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. సాలె నరేష్, శృతి దంపతుల కుమారుడు ధనుష్ శుక్రవారం ఉదయం ఇంటిముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసి శరీరంపై పలు చోట్ల కరిచింది. స్థానికులు గమనించి కుక్క నుంచి బాలుడిని కాపాడారు. బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యుల సూచనమేరకు నీలోఫర్‌కు తరలించారు.

ఆలయాల్లో చోరీ: వెండి కవచం, నగదు అపహరణ

అయిజ: పట్టణంలోని దుర్గానగర్ సమీపంలో వరాహ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దుండగులు ఆలయంనకు వేసిన తాళంను విరగొట్టి లోపలికి చొరబడ్డారు. స్వామివారి వెండి కవచం అపహరించారు. అదేవిధంగా మండలంలోని తూంకుంటలోని చెన్న కేశవ స్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయం గేటుకు ఉన్న తాళంను విరగొట్టి లోపల ఉన్న హుండీని పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. కాగా ఘటనలపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయభాస్కర్ తెలిపారు.

షా అలీ చిన్న కిస్తీ పోటీలు


కిస్తీ పోటీలను వీక్షిస్తున్న భక్తులు

- ఉర్సుకు తరలివచ్చిన భక్తులు

అలంపూర్/అలంపూర్ రూరల్: షా అలీ పహిల్వాన్ ఉర్సు ఘనంగా కొనసాగుతుంది. ఇందులో భాగంగా రెండో రోజు షాఅలీ పహిల్వాన్ సర్ ముబారక్ దర్గాలో శుక్రవారం చిన్న కిస్తి పోటీలు జరిగాయి. భక్తులు దర్గాలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమ మొక్కులు తీర్చుకోవడానికి తెచ్చిన ప్రసాదాలను కిస్తీలలో వేయగా యువకులు, చిన్నారులు పోటీపడి వివిధ రకాల విన్యాసాలను చేస్తూ ప్రసాదం కోసం పోటీపడ్డారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకోవడానికి కిస్తిలో పలావ్, మిఠాయిలు వేయగా అక్కడే ఉన్న యువకులు, చిన్నారులు పోటీ పడి దక్కించుకున్నారు. ఉర్సును పుస్కరించుకుని మతసామరస్యాన్ని చాటుతూ జనం తరలొచ్చి సర్ ముబారక్, దడ్ ముబారక్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రధాన వీధుల్లో వెలిసిన దుకాణ సముదాయాల్లో భక్తులు కొనుగోళ్లు చేశారు. సర్కస్, రంగుల రట్నాలు, బొమ్మల దుకాణాల వద్ద చిన్నారులు సందడి చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో ప్రధాన వీధులు కోలాహలంగా మారాయి.


చిన్న కిస్తీ పోటీల్లో యువకులు

నేడు పెద్ద కిస్తీలు

షాఅలీ పహిల్వాన్ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు దడ్ ముబారక్ దర్గా వద్ద పెద్ద కిస్తీలు శనివారం జరగనున్నాయి. ఉత్సవాల్లో పెద్ద కిస్తిలు ప్రధానంగా ఆకర్షణగా నిలుస్తాయి. పెద్ద కిస్తీ పోటీలు తిలకించడానికి భక్తులు తరలి రానున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానుండటంతో అధికారులు సౌకర్యాలపై దృష్టి సారిస్తున్నారు. భక్తులకు కావాల్సిన తగు ఏర్పాట్లను చేశారు. పెద్ద కిస్తీ పోటీలకు భక్తులు రానుండటంతో పోలీస్ భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

6న డిగ్రీ పరీక్షలు వాయిదా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జూన్ 6న జరగాల్సిన డిగ్రీ సెమిస్టర్ 4, 5 రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్ఐసెట్ నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తేదీలను ప్రకటించిన నేపథ్యంలో వాయిదా వేస్తున్నామని పేర్కొన్నారు. వాయిదా వేసిన పరీక్ష తిరిగి జూన్ 18న నిర్వహిస్తామని, మిగిలిన పరీక్షలు ఎలాంటి మార్పులు ఉండవని విద్యార్థులు గమనించాలని సూచించారు.

ఆయుర్వేద క్లినిక్ తనిఖీ


మందులను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ హేమలత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న 'సాయి రాం ఆయుర్వేదిక్ క్లినిక్'ను జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్ గురువారం సాయంత్రం సీజ్ చేశారు. శుక్రవారం ఆయుష్ విభాగం రాష్ట్ర రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ హేమలత క్లినిక్‌ను పరిశీలించారు. ఇక్కడ తయారు చేసిన మందులు నకిలీవా? వీటిని వాడితే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయి అని నిర్ధారించేందుకు క్లినిక్‌లో గల పలు రకాల ఆయుర్వేదిక్ మందుల శాంపిల్స్‌ను హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. తాము నిర్ధారించే వరకు క్లినిక్‌ను నడపవద్దని నిర్వహకులకు సూచిస్తూ క్లినిక్‌ను సీజ్ చేసి వెళ్లారు. రాష్ట్ర రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంట జిల్లా ప్రోగ్రామ్ అధికారి వంశీకృష్ణ, డాక్టర్ మంజుశ్రీ, మధు, నర్సింహారావు ఉన్నారు.

క్లినిక్ మూసివేత

గద్వాల రూరల్: నిబంధనలకు విరుద్ధంగా ధరూరు మండల కేంద్రంలో కొనసాగుతున్న ఓ క్లినిక్‌ను డీఎంహెచ్‌ఓ శశికళ ఆధ్వర్యంలో వైద్య బృందం తనిఖీ నిర్వహించి మూసివేశారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప, ప్రోగ్రాం అధికారి స్రవంతి క్లినిక్ సెంటర్‌ను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మందుల వినియోగం, అనర్హత కలిగిన వ్యక్తి వైద్యసేవలు అందించడం గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ నిర్వహిస్తున్న శ్రీనివాసులుపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.